ఖతర్నాక్.. వీఆర్వోలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో.. కొందరు వీఆర్ఓలు అంతులేని అవినీతికి పాల్పడ్డారు. జలగలకంటే హీనంగా జనాలను పీల్చి పిప్పిచేశారు. ఇంటిపట్టాలు, మ్యుటేషన్, అసైన్‌మెంట్ కమిటీ, ఇలా ప్రతి దాంట్లోనూ... పైసా లేనిదే.. పనిచేయలేదు. ప్రతిపనికీ వెలకట్టారు.. పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు అవినీతిపరులకే మెడలో వీరతాడు వేస్తుండడంతో.. వీళ్ల ఆగడాలను అడిగే వాళ్లే లేకపోయారు. పెద్ద నాయకులే కాకుండా.. చోటామోటా నాయకులు చెప్పిందల్లా చేశారు. తరాలుగా సాగులో ఉన్న భూములకు కూడా రాత్రికి రాత్రే ఆన్‌లైన్‌లో పేర్లు మార్చేశారు. అడ్డూఅదుపు లేకుండా ఇసుక, మట్టి అక్రమంగా తరలిపోతున్నా.. డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ వీఆర్ఓలకు ఇబ్బందులు తప్పవని అందరూ అనుకున్నారు. కానీ ఈ ప్రభుత్వంలోనూ చక్రం తిప్పేందుకు అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం జిల్లా రెవెన్యూ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.



- జలగల్లా.. జనాలను పీడించారు
- వైసీపీ పాలనలో అందినంతా దోచుకున్నారు
- ఇప్పుడు మళ్లీ కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం..
- అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖతర్నాక్ వీఆర్‌ఓల అంశంపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వంలో వీరు అక్రమార్కులకు కొమ్ముకాశారు. అందినకాడికి దోచుకొని వెనకేసుకున్నారు. ప్రజలను జలగల్లా పీక్కుతిన్నారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ.. సహజసంపద వైసీపీ నాయకులకు ఆదాయవనరుగా మార్చేశారు. ఎవరికో ఇచ్చిన ఇంటి పట్టాలో ? మరెవరో ఇళ్లు కడుతుంటే.. అడ్డుకోవాల్సిన వీళ్లు.. అక్రమార్కులకే వంతపాడారు. ఇలా ఒకటా..? రెండా..? మూడా..? ఎన్నో.. ఎన్నెన్నో అక్రమాలకు తెరలేపారు. ఈ ఉపోద్ఘాతమంతా.. చూడడానికి రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగులు.. అక్రమార్జనలో పెద్దస్థాయిలో ఉంటున్న వీఆర్వోల గురించే. జిల్లాలో ఏ అతికొద్ది మంది మినహా మిగిలిన చాలా మంది వీఆర్వోలంటే.. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ కాదని.. వెరీ రిచ్ ఆఫీసరని పేర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విచ్చలవిడిగా అక్రమ సంపాదనకు పాల్పడిన వాళ్లు.. కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పేందుకు యత్నిస్తుండడం విశేషం. వీలైతే తాము పనిచేస్తున్న చోటునే ఉంచాలని... అదీ కుదరకపోతే.. పక్క గ్రామానికి.. ఇంకా కుదరకపోతే.. ఇప్పుడున్న మండలంలోనే ఉంచాలని అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

రెండు చేతులా సంపాదన

రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగి అంటే.. వీఆర్వోగా చెప్పవచ్చు. వీళ్లు చేసే ఉద్యోగం చిన్నదే అయినా.. ఏ ఫైల్ కదలాలన్నా.. వీళ్లు రిపోర్టు రాసి.. మొదలుపెట్టాలి. అంటే.. ఉద్యోగం చిన్నదైనా.. గట్టిదేనన్నమాట.. దీన్ని అడ్డం పెట్టుకుని.. చాలామంది రెండు చేతులా సంపాదించేశారు. గత ఐదేళ్లలో జిల్లాలో పనిచేసిన వీఆర్వోలను వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలో మినహా.. మిగిలిన వాళ్లు.. విచ్చలవిడిగా సంపాదించారు. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న కాలనీలు వీఆర్వోలకు బంగారు బాతుల్లాగా మారాయని చెప్పవచ్చు. ప్రభుత్వ భూములను అక్రమంగా కట్టబెట్టడం.. ఇప్పటికే ఉన్న భూములకు ఆన్‌లైన్, మ్యుటేషన్ చేయడం, అసైన్‌మెంటు భూపంపిణీ, ఇసుక అక్రమ రవాణా, మట్టి, రాళ్లు అక్రమ రవాణా ఇలా.. గ్రామ స్థాయిలో అనేక అక్రమాలకు పాల్పడ్డారు.

సార్.. మీరు చెప్పినట్లే చేస్తాం

గత ప్రభుత్వంలో అనేక అక్రమాలకు పాల్పడిన వీళ్లు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ.. చక్రం తిప్పేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పలువురు వీఆర్వోలు ఎమ్మెల్యేలను స్వయంగా కలిసి.. సార్.. అప్పట్లో తమదేం తప్పులేదు.. వైసీపీ వాళ్లు చెప్పారు. చేయక తప్పలేదు.. ఇప్పుడు మీరు తమకు మంచి చోట పోస్టింగ్ ఇవ్వండి.. ఇక మీరు చెప్పినట్లే చేస్తామని చెప్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలను స్వయంగా కలవలేని వాళ్లు.. చోటా, మోటా నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. అన్నా... మీ సార్‌తో మాట్లాడి.. నన్ను ఇక్కడే ఉండేలా చూడు.. లేకుంటే పక్క గ్రామానికి పంపించు.. నీ రుణం తీర్చుకుంటా.. అంటూ బేరసారాలకు దిగుతున్నారు. ఇంకా కొందరు వీఆర్వోలు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ముఖ్యనాయకులను మచ్చిక చేసుకునేందుకు.. తాము ఇప్పటివరకు పనిచేసిన గ్రామంలోని ప్రభుత్వ భూముల జాబితా ఆ నాయకులకు ఇస్తున్నట్లు సమాచారం. తాము ఇక్కడే ఉంటే.. ఈ ప్రభుత్వ భూములను మీరు కోరుకున్న వాళ్ల పేరు మీద మార్చేందుకు సహకరిస్తామని (ఏ మార్గంలో వెళ్తే పని అవుతుందో.. చెప్తామని) చెప్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలువురు వీఆర్వోలు తాము కోరుకున్న చోట పోస్టింగ్ కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకుల నుంచి లెటర్లు తీసుకుని.. కలెక్టరేట్‌లో సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది.

అవినీతి వీఆర్వోల భాగోతాలలో మచ్చుకు కొన్ని..

జిల్లా కేంద్రం రాయచోటిలో ఓ వీఆర్వో అవినీతి అక్రమాలకు అడ్డేలేదని సమాచారం. సదరు వీఆర్వో పనిచేస్తున్న పరిధిలోనే జగనన్న కాలనీలు ఉండడం.. గతంలో ఎప్పుడో ఇచ్చిన ఇందిరమ్మ కాలనీల్లో ఇంటి పట్టాలు జోరుగా అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరికో ఇచ్చిన ఇంటి స్థలంలో మరెవరో ఇళ్లు కడుతున్నా.. సదరు వీఆర్వో ఎవరు డబ్బు ఇస్తే.. వాళ్లకే సపోర్ట్ చేస్తారనే పేరుంది. సదరు వీఆర్వో పలువురితో బేరసారాలు సాగిస్తుండగా.. ఫోన్‌లో రికార్డు చేసిన మాటలు సోషియల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఇప్పటికే ఓ మంచి ఇల్లు కట్టుకున్న సదరు వీఆర్వో చేతిలో ఇంకా అనేక ఇంటి పట్టాలు అనధికారికంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడే పనిచేసే ఇంకో వీఆర్వోది మరో కథ.. ఆ వీఆర్వో వైసీపీ హయాంలో ముఖ్యనాయకులు అందరితోనూ మంచి సంబంధాలే నడిపాడు. వాళ్లు చెప్పిందల్లా చేశాడు.. తానూ సంపాదించుకున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఇతన్ని చూసిన తోటి రెవెన్యూ సిబ్బంది.. ఇతనికి ఇబ్బందులు తప్పవేమో అనుకున్నారు. అయితే ఏమైందో. ? ఏమో.. ? ప్రస్తుతం అధికార పార్టీలో కొందరు నాయకులతోనూ.. బాగా సంబంధాలు నడుపుతున్నాడు.

- నిమ్మనపల్లెలోని ఇద్దరు వీఆర్వోలపై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ.. దీర్ఘకాలికంగా ఇక్కడే పని చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఇక్కడి నుంచి బదిలీ కాకుండా చూసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- రైల్వేకోడూరు మండలంలో 23 మంది వీఆర్వోలు ఉండగా.. అందులో 16 మంది 8 సంవత్సరాలకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారు. 23 మంది వీఆర్వోలలో చాలా మందిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అయినా ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు టీడీపీ ముఖ్యనాయకుల దగ్గర లెటరు తీసుకుని కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది.
- పెద్ద తిప్పసముద్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న విద్యాసాగర్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. దీంతో ఆయన అప్పట్లో వైఎస్సార్ నాయకులు చెప్పినట్లు నడుచుకున్నారు. ఇతను ఇసుక అక్రమ రవాణాకు సహకరించాడు. రీ సర్వేలో అవకతవకలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఇక్కడ తహసీల్దార్ విధుల్లో చేరినా.. ఇప్పటికీ ఇక్కడ డీటీగా విద్యాసాగర్ ఉండడం విశేషం. మండలంలో పనిచేసిన కొందరు వీఆర్వోలు ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- వాల్మీకిపురం మండలంలో 14 మందికి గానూ.. 12 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది వైసీపీ ప్రభుత్వంలో అనేక అక్రమాలకు తోడ్పడి.. ఇప్పుడు మళ్లీ ఇక్కడే ఉండేందుకు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.
- తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటలో వీఆర్వోలలో పలువురు.. ఇక్కడి నుంచి వెళ్లిపోతే చాలు దేవుడా అని ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో అనేక తప్పులు చేశాము. ఇక్కడే ఉంటే.. అవి ఎక్కడ బయటపడతాయో అని ఆందోళన చెందుతున్నారు.
- సుండుపల్లె మండలంలోని వీఆర్వోలలో.. ఇద్దరి అక్రమాల జోరు ఎక్కువనే చెప్పవచ్చు. అక్రమార్కుల దగ్గర లక్ష రూపాయలు తీసుకుని అక్రమాలకు సహకరించారు. మండలంలో నాలుగైదు పంచాయతీలకు ఇన్‌ఛార్జ్‌గా తీసుకుని వసూళ్ల దందా కొనసాగించారనే ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఇంటి పట్టాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికావడం వెనుక కొందరి వీఆర్వోల పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి.
- ఓబులవారిపల్లెలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌ను గత ప్రభుత్వంలో ఎఫ్ఏసీగా నియమించుకున్నారు. అప్పట్లో వైసీపీ అక్రమాలకు ఆ డీటీ పూర్తిగా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడినా.. సదరు డీటీ బదిలీ కాకుండా.. ఇక్కడే ఉండడం విశేషం.
- కురబలకోట మండలంలో పనిచేసిన ఓ వీఆర్వో.. కంటేవారిపల్లె ప్రాంతంలో అనేక అక్రమాలకు పాల్పడ్డాడు. ఇప్పుడు మళ్లీ ఇక్కడే ఉండేందుకు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇప్పటికైనా కూటమి ముఖ్యనాయకులు, ఎమ్మెల్యేలు గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలకు పాల్పడి.. బాగా సంపాదించిన వీఆర్వోలకు పోస్టింగుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మొక్కలను విరివిగా నాటుదాం

- వన మహోత్సవంలో కలెక్టర్ శ్రీధర్ పిలుపు



వన మహోత్సవంలో భాగంగా పార్కులో మొక్క నాటుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటిటౌన్, ఆగస్టు 30: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించుకుందామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, సబ్-డివిజనల్ అటవీ శాఖ అధికారి శుభమ్, డ్వామా పీడీ మద్దిలేటి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ప్రైవేటు విద్యా సంస్థల జేఏసీ కన్వీనర్ పి.మదనమోహన్‌రెడ్డిలతో కలిసి రాయచోటి పట్టణ పరిధిలోని మాండవ్య ఎకో పార్క్ (నగర వనం)లో సామాజిక వన అటవీ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 68 వేల మొక్కలు నాటామని, ఎక్కడైతే చెట్లు నాటామో వాటిని అలా వదిలేయకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అత్యంత అటవీ ప్రాంతం ఉన్న జిల్లాల్లో అన్నమయ్య జిల్లా కూడా ఒకటన్నారు. జిల్లాలో సుమారు 36 శాతం భూభాగం అటవీ ప్రాంతంగా ఉందని, జిల్లా ప్రజలంతా ఒక బాధ్యతగా అడవిలోని చెట్లను కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా బఫర్ జోన్లు, రోడ్లు పక్కన, పార్కులు, పాఠశాలలు, కళాశాలలు, ఇంటి పరిసరాలలో ఎక్కడ వీలైతే అక్కడ చెట్లను పెంచుకోవాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాతో పాటు రాయలసీమలో వర్షాలు చాలా తక్కువ పడ్డాయని, వర్షాలు పడాలన్నా, పంటలు పండాలన్నా చెట్లు ఎంతగానో అవసరమని సూచించారు. నగరవనంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత అటవీ శాఖ, మున్సిపల్ శాఖలు తీసుకోవాలన్నారు. అలాగే మొక్కలు నాటితే ఉపాధి హామీ పథకం కింద వాటి సంరక్షణకు లేబర్ ఖర్చులు కూడా ఇస్తామని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో 'మొక్కలను నాటి సంరక్షిస్తామని, చెట్ల సంపద, వృక్ష సంపదను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అటవీశాఖ అధికారిణి నాగమహేశ్వరి, సబ్-డివిజనల్ అటవీ అధికారి శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయాలి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 30: జిల్లా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పటిష్టం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీసీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని పరిశ్రమల కార్మికులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. రెడ్ కేటగిరీలో వున్న పరిశ్రమలకు భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా జిల్లాలో గుర్తించిన 35 హైరిస్క్ పరిశ్రమల్లో నిర్దేశించిన 6 పారామీటర్ల మేరకు భద్రతా ప్రమాణాలు పరిశీలించి 50 రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలోని ఓ పరిశ్రమలో జరిగిన సంఘటన నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతను పటిష్టం చేసిందన్నారు. అనంతరం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో అమ్మోనియం వాడే పరిశ్రమలు ఎక్కువగా వున్నాయని, అలాగే కెమికల్ ఫ్యాక్టరీలు, ఒక హెచ్‌పీసీఎల్ స్టోరేజ్, మరొక పెద్ద ఇండస్ట్రీ వుందన్నారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు తీవ్రమైన ప్రమాదాలు జరగలేదని, అనుకోకుండా చిన్నచిన్న ప్రమాదాలు 20 వరకు జరిగాయని వారు కలెక్టర్‌కు వివరించారు. పారిశ్రామిక ఎస్టేట్‌లో కనీస అవసరాలైన రోడ్లు, నీటిసౌకర్యం, తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో భూమి చాలా అందుబాటులో వుందని, చదువుకొన్న విద్యావంతులు, నైపుణ్యం కలిగిన కార్మికులు ఎక్కువగా వున్నారని, వీరందరికి ఉద్యోగాలు కల్పించాలంటే జిల్లా బలం, బలహీనతలు దృష్టిలో ఉంచుకొని పారిశ్రామిక విధానాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పరిశ్రమల అధికారి సూరిబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, డీటీసీ భరత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు, విద్యుత్‌శాఖ అధికారులు, యాజమానులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 5కే మారథాన్ రన్ : డీఎంఅండ్‌హెచ్‌ఓ

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 30: ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు రాయచోటిలో 5కే మారథాన్ రన్ ఉంటుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రజలు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు యూత్‌ఫెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 5:30 గంటలకు చిత్తూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) నుంచి మదనపల్లె రింగ్‌రోడ్డు వరకు, అనంతరం తిరిగి డిగ్రీ కళాశాల వరకు 5కే రన్ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాజంపేట పూర్వ ఆర్డీవో కోదండరామిరెడ్డి సస్పెన్షన్



కోదండరామిరెడ్డి

రాజంపేట, ఆగస్టు 30: రాజంపేట రెవెన్యూ డివిజన్ ఆర్డీవోగా గతంలో పనిచేసిన డి.కోదండరామిరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కోదండరామిరెడ్డి తిరుపతిలో గాలేరు-నగరి సుజల స్రవంతి యూనిట్-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్నారు. గతంలో రాజంపేట ఆర్డీవోగా పనిచేస్తూ అనేక భూ వివాదాలకు ఆజ్యం పోసి అర్ధాంతరంగా తిరుపతికి బదిలీపై వెళ్లారు. వివరాల్లోకి వెళ్తే..

2022లో కోదండరామిరెడ్డి రాజంపేట ఆర్డీవోగా పనిచేస్తూ అదే సమయంలో గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకుని పనిచేసేవారు. ఆ సమయంలో గాలేరు-నగరి భూసేకరణలో భాగంగా కె.నాగిరెడ్డి భూ వివాదానికి సంబంధించి కౌంటర్ అఫిడవిట్ హైకోర్టుకు దాఖలు చేయడంలో వివాదం రేగింది. ఈ విషయంపై ఆ భూమికి సంబంధించిన కె.నాగిరెడ్డి రిట్ పిటీషన్ నంబరు 119/2022 దాఖలు చేశారు. ఈ విషయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డి కోర్టుకు కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయడంలో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరులశాఖ ఉన్నతాధికారులు కోదండరామిరెడ్డిపై గతంలో శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ సమయంలో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్అండ్ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీఎల్ఏ ఆర్అండ్ఆర్ యాక్టు 2013 చట్టాల్లోని అంశాలు విస్మరించారని, హైకోర్టులో వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. దీనివల్ల హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరులశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈయన సెప్టెంబరులో పదవీ విరమణ చేయనున్నారు. ఒక నెల ముందు సస్పెండ్‌కు గురికావడం సంచలనం రేపింది.

రాజంపేటలో భూ కబ్జాలకు తెర

గత జగన్ ప్రభుత్వంలో 2022లో ఆర్డీవోగా పనిచేసిన కోదండరామిరెడ్డి రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో వైసీపీ నేతలు వేలాది ఎకరాల భూకబ్జాలకు పాల్పడడంలో కోదండరామిరెడ్డి పాత్ర ఎంతో ఉందని చెబుతున్నారు. ఈయన అప్పటి ఎమ్మెల్యేల అనుచరులకు అడుగులకు మడుగులొత్తుతూ అనేక భూకబ్జాలు జరిగేందుకు ప్రధాన కారకుడయ్యాడని ఆరోపణలు బలంగా ఉన్నాయి. రాజంపేట పట్టణానికి అల్లంత దూరంలో రూ.కోట్లు విలువ చేసే పోలి గుట్ట భూకబ్జాకు, పుల్లంపేటలో కొల్లం గంగిరెడ్డి అనుచరులు చేసిన భూకబ్జాలకు, నందలూరు, ఓబులవారిపల్లె మండలంలో వందలాది ఎకరాల భూకబ్జాలకు వైసీపీ నేతలు పాల్పడగా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. కాగా ఈయన రేణిగుంట వద్ద స్వగృహం నిర్మించుకునే సమయంలో ఇసుక, కంకర, ఇటుకలు, ఇంటికి కావాల్సిన టేకు కలపతో సహా రాజంపేట నుంచే భూకబ్జాదారులు సరఫరా చేసినట్లు చెబుతారు. ఆ సమయంలో ఈ వ్యవహారం పెద్ద హాట్‌టాఫిక్‌గా మారింది. ఇతనిపై ఆరోపణలు భారీగా రావడంతో వైసీపీలోని వైరివర్గాలు తిరుపతికి బదిలీ చేయించినట్లు సమాచారం.

ఇరువురు ప్రత్యేక అధికారుల నియామకం

కలికిరి, ఆగస్టు 30: కడప, అన్నమయ్య జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని పరిశీలించి పర్యవేక్షించేందుకు ఇరువురు ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం జీవో జారీ చేశారు. కడప జిల్లాకు ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధరబాబును నియమించగా, అన్నమయ్య జిల్లాకు రాష్ట్ర మహిళా శిశు ప్రత్యేక ప్రతిభావంతుల వయోజనుల శాఖ కార్యదర్శిగా ఎ.సూర్యకుమారిని నియమించారు. సంక్షేమ పథకాలతో పాటు జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ కార్యక్రమాల అమలును వీరు పర్యవేక్షించనున్నారు.

వేరుశనగ రైతుకు కన్నీరే..

- ఊడగ, బుడ్డ దశలో పడని వర్షం
- ఎండిన పైరు
- దిగుబడిపై ఆశలు వీడిన రైతులు
- ఈ ఏడాదీ నష్టాలే..



ఎండిపోయిన వేరుశనగ పొలాలు

సంబేపల్లె, ఆగస్టు 30: వేరుశనగ రైతుపై భానుడు పగబట్టాడు. వరుణుడు మొహం చాటేశాడు. నింగికేసి చూస్తున్న వేరుశనగ రైతును దోబూచులాడుతున్న మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప చుక్క చినుకు రాలలేదు. పట్టుమని ఒక మోస్తరు వర్షం కూడా కురవడం లేదు. కళ్ల ముందే వేరుశనగ పంట ఎండిపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వేరుశనగ రైతుపై ఆర్థికపోటు మాత్రం తప్పలేదు. ఈ ఏడాది జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలో 8940 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయాల్సి ఉండగా 1360 హెక్టార్లలో మాత్రమే సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వరుస నష్టాలు, కష్టాలు తప్ప ఆదాయం లేకపోవడంతో రైతులు వేరుశనగ సాగుపై సుముఖత చూపలేదని చెప్పవచ్చు. ఖరీఫ్‌లో రైతులు వర్షాధారం కింద ప్రధానంగా సాగు చేసే పంట వేరుశనగ. ప్రతి ఏడాది ప్రకృతి విపత్తులతో వేరుశనగ రైతులకు నష్టాలు తప్ప ఆదాయం కనిపించడం లేదు. ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి 18 వేలు పెట్టుబడులు పెట్టి రైతులు గంపెడాశతో పంట సాగు చేయడం, వర్షాలతో ఏటా నష్టపోవడం జరుగుతూనే ఉంది. ఈ ఏడాది వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ రైతుకు కన్నీళ్లు, కష్టాలు తప్ప ఆదాయం కనిపించడం లేదు. వేరుశనగ ఊడగ, బుడ్డ దశలో వర్షాలు పడలేదు. దీంతో బుడ్డ కాయ మోడుబారిపోయింది. దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలో మండలాల వారీగా సంబేపల్లెలో 190 హెక్టార్లు, చిన్నమండెంలో 70, రాయచోటిలో 160, గాలివీడులో 626, లక్కిరెడ్డిపల్లెలో 248, రామాపురంలో 66 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. సంబేపల్లె మండలంలో 2348 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయాల్సి ఉండగా 190 హెక్టార్లలో మాత్రమే పంట సాగు చేశారు.

పూర్తిగా ఎండిపోయింది..



వర్షాలు పడలే, ఎండలు భగభగమంటున్నాయి. పంట చూస్తే ఎండిపోయింది. ఒక వర్షం పడినా ప్రయోజనం లేదు. పంట వదిలేయాల్సిందే. చెట్టుకు రెండు, మూడు కాయలు ఐదు ఆరు బుడ్డలు తప్ప కనిపించడం లేదు. పెట్టుబడి కూడా రాదు. ఈ ఏడాది నష్టాలు తప్ప ఆదాయం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గోపాల్‌నాయుడు, అడవికమ్మపల్లి

వాతావరణ బీమాతో ఫలితం సున్నా

ఒకప్పుడు వేరుశనగ పంట సాగుకు పంటల ఆధారిత బీమా కింద రైతులకు నష్టపరిహారం అందించేవారు. క్లస్టర్‌గా తీసుకుని ఆ పరిధిలో పంటల దిగుబడి పరిశీలించి రావాల్సిన దిగుబడి కన్నా తక్కువ దిగుబడి వచ్చినప్పుడు రైతులకు నష్టపరిహారం వచ్చేది. ప్రస్తుతం వాతావరణ ఆధారిత బీమా వేరుశనగ పంట సాగుకు ముడిపెట్టడంతో రైతులకు పంట నష్టం వాటిల్లినా నష్టపరిహారం మాత్రం రావడం లేదు. వాతావరణ ఆధారిత బీమా జూన్, జూలై నెలలో కురిసే వర్షాల ఆధారంగా సరాసరిన టార్గెట్ ప్రకారం వర్షాలు పడితే నష్టం ఉన్నా లేనట్టుగానే గుర్తిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో కరువు మండలాలను ప్రకటిస్తే సంబేపల్లె మండలం కరువు మండలాల జాబితాలో లేకపోవడం ఇందుకు నిదర్శనం. మూడు నెలల్లో కురవాల్సిన వర్షం జూన్ నెలలో కురవడంతో జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు కురవక పంట తీవ్రంగా నష్టపోయారు. అయినా కరువు జాబితాలో మండలాన్ని ప్రకటించలేదు. ఈ ఏడాది జూన్‌లో 62 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా 237 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలై నెలలో 104 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 70.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇలా ఒక నెలలో ఎక్కువ వర్షాలు కురవడం రెండో నెలలో తక్కువ వర్షాలు కురవడంతో రైతులు నష్టపోయారు.

వర్షం పడినా ఫలితం లేదు..



ఊడగలు, బుడ్డల సమయంలో వర్షం పడలేదు. పంట ఎండిపోయింది. ప్రస్తుతం వర్షం పడినా ప్రయోజనం లేదు. రెండున్నర ఎకరం పంట సాగు చేశారు. ఇప్పటికే సుమారు 50 వేలు ఖర్చు పెట్టా. ఇంకా పంట నూర్పిడి చేయాలి. పంట చూస్తే నమ్మకం సన్నగిల్లిపోయింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. ఇలాగైతే బతకడం కష్టం. వేరుశనగ సాగు చేయాలంటే భయమేస్తోంది.

- నాగరాజు, రైతు, దుద్యాల



దోబూచులాడుతున్న మేఘాలు

ఇసుక కొరత..అభివృద్ధి పనులకు బ్రేక్

● రెండు నెలలుగా ఆగిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

● పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 30: రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే ముఖ్యంగా ఇసుక వనరు చాలా ముఖ్యం. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. కొత్త ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక పాలసీ తెచ్చినప్పటికీ.. ప్రొద్దుటూరులో ఇసుక రీచ్ ఏర్పాటు కాలేదు. దీంతో ఈ ప్రాంతంలో ఇసుక అందుబాటులో లేదు. కేవలం అక్రమంగా కొందరు ఇసుకను పెన్నానదిలో నుంచి రవాణా చేస్తున్నారు. కానీ పబ్లిక్ వర్కులకు (ప్రభుత్వ పనులకు) అక్రమ ఇసుకను వినియోగించలేని పరిస్థితి. చుట్టుపక్కల ఇంకా ఇసుక రీచ్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో అభివృద్ధి పనులకు ఇసుక కొరత వేధిస్తోంది.



ఇసుక లేక స్లాబ్ దశలో నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణపనులు

గత రెండు నెలలుగా ఇసుక కొరతతో పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆధునాతన మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు నిలిచిపోయాయి. మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతున్న కేసీపీ నిర్మాణ సంస్థ ఇసుక లేక స్లాబ్ కాంక్రీట్ పనులు నిలిచిపోయాయని వెల్లడిస్తున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. రెండు నెలలు గడిచినా ఇసుక సమస్య తీరకపోవడంతో పనులు నిలబెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు కేవలం రూ.5 కోట్ల మేర మాత్రమే బిల్లులు అయ్యాయని.. ఇంకా రూ.10కోట్లపైన బిల్లులు పెండింగ్ వున్నాయని కెసీపీ నిర్మాణ సంస్థ ప్రతినిధి చలపతి వాపోయారు. కొత్త ప్రభుత్వంలో ఈ నిర్మాణ పనులకు బిల్లులు వస్తే పనులు త్వరితగతిన పూర్తి చేయగలమన్నారు.

రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అక్రమ రవాణాలో పట్టుబడిన ఇసుక రూరల్ పోలీసు స్టేషన్‌లో టన్నులమేర ఇసుక నిల్వలు వున్నాయి. వాటిని పబ్లిక్ వర్కులకు కేటాయించేలా రెవెన్యూ అధికారులకు లెటర్ పెట్టాం. తహసీల్దారు కూడా ఆర్‌డీవోకు లెటర్ పెట్టారు. వారి నుంచి అనుమతి రాగానే ఇసుకను రూరల్ పోలీసుస్టేషను నుంచి తరలించి.. అభివృద్ధి పనులకు వాడతాం. అలాగే ఇసుక రీచ్ ఏర్పాటుకు కూడా లెటర్ పెడతాము.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

గండికోట ప్రాజెక్టులో తనిఖీ



గండికోట ప్రాజెక్టును తనిఖీ చేస్తున్న నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు

కొండాపురం, ఆగస్టు 30: గండికోట ప్రాజెక్టును నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్‌డబ్ల్యూడీఏ సీఈ దేవేందర్ రావు, డీడీ లలిత ప్రాజెక్టును తనిఖీ చేశారు. గండికోట ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టులో నాణ్యత, గేట్లను తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల తనిఖీలో భాగంగా వారు గండికోట ప్రాజెక్టును సందర్శించినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రవికిరణ్, డీఈలు ఉమా మహేశ్వర్లు, వివేక్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు సుదర్శన్, రమణ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి నీటి విడుదల పెంపు

గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి శుక్రవారం నీటి విడుదలను పెంపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గురువారం మైలవరానికి 7,500 క్యూసెక్కులు విడుదల చేయగా.. 15,000 క్యూసెక్కులకు పెంచారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 19 టీయంసీలు పైగా నీరు నిల్వ ఉంది.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

చక్రాయపేట, ఆగస్టు 30: సమయాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గండి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎస్సీ, ఎస్టీ సెల్ తరపున ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. చదువు, ఉద్యోగం, ఉపాధిలో సమయం విలువ గురించి, చదువు గొప్పదనాన్ని వివరించారు. డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త, ఎస్సీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అధ్యాపకులు కె.రవి, డాక్టర్ వెంకటేశ్వర్లు, లైదియ, కవిత, సత్య, విజయ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయం నుంచి నీరు విడుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైలవరం ఉత్తరకాలువకు నీటి విడుదల, బ్రహ్మంసాగర్‌లోకి చేరిన కృష్ణాజలాలు

మైలవరం, ఆగస్టు 30: మైలవరం జలాశయం నుంచి ఉత్తరకాలువకు 50 క్యూసెక్కుల నీటిని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డిలు శుక్రవారం విడుదల చేశారు. ముందుగా మైలవరం జలాశయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గండికోట జలాశయానికి ఇప్పటికే 18 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, అక్కడి నుంచి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావం దృష్ట్యా ఉత్తరకాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, దక్షిణ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారన్నారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల తాగు, రైతుల సాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మరో 10 రోజుల్లో పెన్నానదికి మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జలాశయ ఈఈ పురుషోత్తం, డీఈఈ నరసింహమూర్తి, ఏఈఈ గౌతమ్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌లోకి కృష్ణాజలాలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 30: తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కృష్ణాజలాలు చేరాయని తెలుగుగంగ ప్రాజెక్టు అసిస్టెంటు ఇంజనీరు నాగేశ్వర్‌రావు తెలిపారు. కృష్ణాజలాలు వెలుగోడు ప్రాజెక్టు నుంచి ఎస్‌ఆర్-1, ఎస్‌ఆర్-2 పూర్తిస్థాయిలో నిండి బ్రహ్మంసాగర్‌కు వెయ్యి క్యూసెక్కులు నీళ్లు వస్తున్నాయన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టులో కూడా నీరు ఎక్కువగా ఉండడంతో ఈ సారి బ్రహ్మంసాగర్‌లోకి పూర్తిస్థాయి నీటి మట్టం 15 టీఎంసీలు నిల్వ ఉంచే ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నారని.. రైతన్నలు వ్యవసాయానికి ఈ సారి పూర్తిస్థాయిలో నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.

ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కోట మృత్యుంజయరావు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: వైవీయూ ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కడప నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు ప్రదర్శన కొనసాగుతుంది. ఆర్ట్స్ గ్యాలరీలో శిల్పకళ, చిత్రకళ, ప్రింట్ మేకింగ్, డిజైన్‌లను విద్యార్థులు తిలకించారు. ఫైన్‌ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు విద్యార్థులకు కళల గురించి పరిచయం చేశారు. చిత్రకళ, శిల్పకళ అవకాశాల గురించి అవగాహన కల్పించారు.

మూలమల్లికార్జునరెడ్డికి జానపద సాహిత్య పురస్కారం



మూల మల్లికార్జునరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డికి జానపద సాహిత్య పురస్కారం ఇస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ వసుంధరరెడ్డి ప్రకటించినట్లు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. కవిగా, రచయితగా, సాహిత్య విమర్శకుడిగా, నాటకకర్తగా, నటుడిగా, నాటక ప్రయోక్తగా మూల సాహిత్య నాటకరంగాలకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. జానపద సాహిత్య పరిషత్, హైదరాబాదు 50 ఏళ్లగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వార్షికోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 2న హైదరాబాదు, కూకట్‌పల్లి, క్రిష్ణ సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందజేయనున్నారు. మూల మల్లికార్జునరెడ్డికి అవార్డు రావడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



దోమల నియంత్రణపై ప్రచారంలో పాల్గొన్న మలేరియా అధికారి మనోరమ

కడప(కలెక్టరేట్) ఆగస్టు 30: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలమని జిల్లా మలేరియా అధికారి మనోరమ సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రకాష్ నగర్‌లో నిర్వహించిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. ప్రతి ఇంట్లో వారానికి ఒక రోజు పాత్రలు, తొట్లు, కూలర్లు, కుండలు శుభ్రంగా ఎండ బెట్టాలన్నారు. రాత్రి పూట దోమ తెరలను వాడాలన్నారు జ్వరాలు వస్తే వెంటనే ఏఎన్ ఎంలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి బాపుల్లయ్య, శంకర్ రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగిపై వైసీపీ నాయకుడు దాడి - కేసు

ఒంటిమిట్ట, ఆగస్టు 30: మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌పై మండల వైసీపీ నాయకుడు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కుమారుడు శ్రీకర్‌రెడ్డిలు దాడి చేశారు. బాధితుడి వివరాల మేరకు.. ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఇంటికి సంబంధించి విద్యుత్ బకాయి దాదాపు రూ.30వేలు ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెల్లించాలని అడగడంతో.. మమ్మలనే బకాయి అడుగుతావా.. అంటూ పరుష పదజాలంతో దాడి చేశారన్నారు. తనపై దాడి జరుగుతున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తుండగా పక్కనే ఉన్న మరికొంత మందితో కలిసి తన మొబైల్ ఫోను తీసుకున్నారని బాధితుడు తెలిపారు. దీనిపై ఏఈ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కుమారుడు శ్రీకర్‌రెడ్డితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అయిదుగురికి రిమాండ్

చాపాడు, ఆగస్టు 30: మండలంలోని లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామానికి చెందిన అయిదుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం భూమి తగాదా విషయమై వీరభద్రాపురం గ్రామానికి చెందిన సురేంద్రారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డిలను గాయపరిచినట్లు తెలిపారు.

రేపు అండర్-14 పురుషుల క్రికెట్ ఎంపికలు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 30: నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు అండర్- 14 పురుషుల క్రికెట్ ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. హాజరయ్యే ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన సర్టిఫికెట్, (ఫారమ్-5) పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కిట్ బ్యాగ్ కూడా వెంట తీసుకురావాలన్నారు. ఇందులో అండర్-14 కటాఫ్ డేట్ 2010 సెప్టెంబర్ 1 తర్వాత నుంచి 2012 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 30: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. పులివెందులకు చెందిన జగదీష్, సాయి పవన్‌రెడ్డి, సయ్యద్ మున్నార్, ఇర్ఫాన్ గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 1 కిలో 108 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని... ఈమేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అరకొర వసతులు.. అయినా ఫలితాల్లో టాపర్లు

● వేధిస్తున్న అధ్యాపకులు, తరగతి గదుల కొరత

● 16 సంవత్సరాలుగా గెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధన

● అయినా.. ఎనిమిదేళ్లుగా ప్రతిభ చాటుతున్న విద్యార్థులు

● ఉర్దూ జూనియర్ కళాశాల దుస్థితిపై తల్లిదండ్రుల ఆవేదన

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 30: ఆ కళాశాలలో అరకొర వసతులున్నా.. అధ్యాపకల కొరత వేధిస్తున్నా.. విద్యార్థులు మాత్రం ఎనిమిదేళ్లుగా జిల్లా టాపర్లుగా నిలుస్తున్నారు. కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత ప్రతిభ కనబరుస్తామని ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుల వినతి మేరకు 2008లో వసంతపేటలోని 18వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఎంపీసీ, బైసీపీ, సీఈసీ గ్రూపులతో ఉర్దూ ఇంగ్లీషు మీడియంలో బోధన చేస్తున్నారు. ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, రాజుపాళెం, చాపాడు, కమలాపురం, చిన్నచెప్పలి, వెలువలి, కానగూడూరు, ఖాదర్‌పల్లి వంటి దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు.

ప్రస్తుతం కళాశాలలో మొదటి సంవత్సరం 86 మంది,ద్వితీయ సంవత్సరంలో 96 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, చార్టెడ్ అకౌంట్లుగా ఉద్యోగాలు చేస్తుండడంతో కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అయితే కళాశాలలో తరగతి గదులు, అధ్యాపకుల కొరతను దృష్టిలో ఉంచుకుని కళాశాలలో చేరడానికి విద్యార్థులు కాస్త జంకుతున్నారు.

16 సంవత్సరాలుగా అరకొర వసతులతోనే....

కళాశాల ఏర్పాటై 16 సంవత్సరాలు అయినా.. తగిన వసతులు లేకపోయినా.. విద్యార్థులు విద్యపై ఆసక్తితో సర్దుకు పోతున్నారు. కళాశాలలో ఇప్పటికీ ప్రిన్సిపల్ పోస్టు ఒక్కటే రెగ్యులర్ కాగా.. అధ్యాపకులందరు గెస్ట్ లెక్చలర్లుగా పనిచేస్తున్నారు. బాటనీ, ఫిజిక్స్ బోధించడానికి అధ్యాపకులు లేరు. అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎన్నిసార్లు అధికారులను కోరినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలంకానీ, ప్రయోగాలు చేసుకోవడానికి ల్యాబ్‌లు లేవు.



ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ముఖద్వారం, అధ్వానంగా ఉన్న కళాశాల తరగతి గదులు

సొంత భవనాలు నిర్మించాలి



పాఠశాల ఆవరణలో కళాశాలను ఏర్పాటు చేశారు. గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా కళాశాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి.

- షేక్ అల్తాఫ్, సీఈసీ ద్వితీయ సంవత్సరం

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇంతవరకు రెగ్యులర్ అధ్యాపకులు లేరు. గెస్ట్ లెక్చలర్లతో బోధన జరుగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంది.

- షాహిదా, ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం

బాత్‌రూములు లేవు



కళాశాలలో అవసరమైన బాత్‌రూములు, మరుగుదొడ్లు లేవు. కళాశాల మొత్తానికి ఒక్క బాత్‌రూము, మరుగుదొడ్డి ఉండడంతో కష్టంగా ఉంది.

- ఆదిల్, సీఈసీ ద్వితీయ సంవత్సరం

వేధిస్తున్న తరగతి గదుల సమస్య

కళాశాలలో తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండడంతో పక్క గదిలో అధ్యాపకుని బోధనలు, విద్యార్థుల అల్లర్లు వినపడకుండా కిటికీలు వేసుకుని పాఠాలు వినాల్సిన పరిస్థితి. వసంతపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని కళాశాల ఉండడంతో ఆ రోడ్డున వెళ్లే వాహనాల శబ్ధ కాలుష్యంతో విద్యార్థులు బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతి గదిని స్వాధీనం చేసుకోవడంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లా టాపర్లుగా నిలుస్తున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరతతో తగిన వసతులు లేకపోయినా పరీక్షా ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారు. జిల్లాలో అయిదు ఉర్దూ జూనియర్ కళాశాలలు ఉండగా 8 సంవత్సరాలుగా కళాశాల విద్యార్థులు జిల్లా టాపర్లుగా నిలుస్తున్నారు. కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించి రెగ్యులర్ అధ్యాపకులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


రాజంపేట: మొక్క నాటుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు


గురుకుల పాఠశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్


సుండుపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న సుగవాసి బాల సుబ్రమణ్యం, అధికారులు

జీవజాతుల మనుగడకు మొక్కలే ఆధారం

రాజంపేట, ఆగస్టు 30 : జీవరాశి మనుగడకు మొక్కలే ఆధారమని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలియజేశారు. శుక్రవారం అటవీశాఖ రేంజర్ ఆర్.నారాయణ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎస్.ఆర్ పాలెం వద్ద నగరవనంలో వన మహోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణీకరణలో భాగంగా వృక్షాల నరికివేతతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, అతివృష్టి, అనావృష్టితో ప్రకృతి విలయతాండవం చేస్తోందన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే ప్రతిఒక్కరు మొక్కలు నాటి వృక్ష జాతిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజు విద్యాసంస్థల ఎన్‌సీసీ స్కౌట్ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్.సుధాకర్, రూరల్ సీఐ రామాంజనేయుడు, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, టీడీపీ మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, కాకతీయ సేవాసంఘం అధ్యక్షుడు శివనారాయణ చౌదరి, సిద్దవటం జడ్పీటీసీ మాజీ సభ్యుడు చలమయ్యయాదవ్, బాకరాపేట సర్పంచ్ ప్రతాప్‌నాయుడు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత , వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.ప్రదీప్‌కుమార్, కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం వారు మొక్కలు నాటించారు. చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి అభినందించారు.

ఓబులవారిపల్లె: పచ్చదనం పరిఢవిల్లినప్పుడే ప్రకృతి పరవశించి వర్షాలు కురుస్తాయని, ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని రైల్వేకోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ అన్నారు. వన మహోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ముక్కావారిపల్లె పంచాయతీ సంజీవపురం గురుకుల పాఠశాలలో ఉపాధ్యా యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం పెరుగుదలతో వాతావరణంలో వస్తున్నమార్పులు, మనుషులు జీవజాలంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అతివృష్టి, అనావృష్టికి కారణమవుతున్నాయని, పండుగ రోజుల్లో పుట్టినరోజు, పెళ్లి రోజులు విశేష జనాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, ఎన్డీయే కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సుండుపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చెట్లునాటే కార్యక్రమాన్ని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఎంపీపీ రాజమ్మ, ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు దామోదర్ నాయుడు, శివ బాలయ్య, జనసేన మహిళా నాయకురాలు రెడ్డి రాణి, ఎస్ఓ శివ శృతి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలి రేంజి పరిధిలోని రాజుకుంట పంచాయతీ అనుంపల్లిలో ఫారెస్ట్ డిపార్టుమెంట్ రేంజర్ ధీరజ్ అధికారులతో కలిసి ముక్కా సాయివికాస్‌రెడ్డి మొక్కలు నాటారు. పంచాయతీ సర్పంచ్ గుత్తి నరసింహా, బాలు రామాంజనేయులు, వెంకటేశ్‌రాజు, మాదాసు నరసింహా, కాకర్ల నాగార్జున, బాలకృష్ణయాదవ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సావిత్రి, కేవీ సుబ్బయ్య, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్ష సంపదను కాపాడుకుంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ఏపీవో పెంచలయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా బంజరు భూమిలో మొక్కలు నాటుతామన్నారు. పొలాలగట్లల్లో మొక్కలు నాటాలన్నారు. ఎంఈఓ చక్రేనాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ పరిమళ, ఎస్ఐ రవీంద్రబాబు, రాజంపేట పార్లమెంట్ సెల్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి షఫినాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్ ముక్తార్, అరిఫుల్లా, కావలి అంజనేయులు, నమ్రుద్దీన్,ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని డ్వామా ఇన్‌చార్జి ఏపీడీ లక్ష్మినరసయ్య పిలుపునిచ్చారు. మట్లి పంచాయతీ చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఏపీఓ నాగరాజు,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

సంబేపల్లి: హరితాంధ్ర కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటుదాం అని ఎంపీడీవో సునీల్ కూమార్, ప్రధానోపాధ్యాయుడు నరసింహ రెడ్డి పిలుపునిచ్చారు. సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయచోటి అంబేద్కర్ గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో మొక్కలు నాటారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అరుణ, ఏపీవో రెడ్డి జోహార్, హౌసింగ్ ఏఈ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలోని సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, ఆగస్టు 30: మండలంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన ఎంపీడీవో విజయరావు శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల నిర్వహణ, పాఠశాలల్లో నీరు, మరుగుదొడ్ల సమస్యలపై ప్రజాప్రతినిధి విజయ్‌కుమార్ ప్రశ్నించారు. ముక్కావారిపల్లె, సంజీవపురం గురుకుల పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు.

తహసీల్దార్ పీర్‌మున్నీ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ అధికారులు మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ సక్రమం గా పనిచేయని ఉపాధి హామీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చివరగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ తాను ఇదే మండలంలో సర్పంచ్‌గా పని చేసి ఎమ్మెల్యేగా మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొ నడం ఒక వరమని తెలిపారు. మండలంలోని సమస్య లపై తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పూనాటి వాసుదేవ రెడ్డి, యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, కల్లా చలపతి, నాగేంద్రనాయుడు, ఓబిలి శ్రీనివాసులరెడ్డి, రమ ణారెడ్డి, కమతం నాగరాజు, అడపాల బాలాజీ, వేణు గోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, జనార్దన్‌నాయుడు, చప్పిడి రమేష్‌బాబు, ఉమ్మలరాజు సుబ్బరాజు, ప్రసాద్‌రెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యగారిపల్లె బ్రిడ్జి పరిశీలన


బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ మధుసూదన్

రాజంపేట, ఆగస్టు 30 : బ్రాహ్మణపల్లె వరదయ్యగారి పల్లెకు వెళ్లే మార్గంలో 1.6 కిలో మీటర్ల వద్ద ఉన్న బ్రిడ్జి సక్రమంగా లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ బ్రిడ్జి వెడల్పు లేకపోవడంతో ఈ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా యంటూ టీడీపీ నాయకులు డీఈకి వివరించడంతో ఆయన శుక్రవారం బ్రిడ్జిని పరిశీలించారు. వెంటనే బ్రిడ్జిని వెడల్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, నేతలు కామినేని సతీష్, కొమ్మి సాంబశివయ్య, కొల్లా వెంటకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదులో క్రమశిక్షణ పాటించాలి

రాజంపేట, ఆగస్టు 30 : దేశవ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాజంపేట సబ్‌కలెక్టర్ సభాభవనంలో బూత్‌లెవల్ అధికారుల శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల పూర్తయిన యువతీ యువకులను గుర్తించి వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జనన, మరణాలను పరిగణలోకి తీసుకుని మరణించినవారి ఓట్లు తొలగించాలన్నారు. బూత్ లెవల్ అధికారులందరూ ఓటరు నమోదు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.. ఈ కార్యక్రమంలో రాజంపేట, కోడూరు నియోజకవర్గా పరిధిలోని బూత్‌లెవల్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న సబ్ కలెక్టర్ నిధియాదేవి

సద్గురు దర్గా మాతాజీ ఆరాధనోత్సవాలు

రామాపురం, ఆగస్టు 30: మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలోని దర్బార్‌నగర్‌లో ఉన్న దర్గాస్వామి ఆశ్రమంలో శుక్రవారం సద్గురు దర్గా మాతాజీ గంగిశెట్టి రంగనాయకమ్మ ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. బెంగుళూరుకు చెందిన పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శనివారం కూడా కార్యక్రమాలు కొనసాగుతాయని కమిటీ సభ్యుడు సత్యం స్వామి తెలిపారు. భక్తులు పెద్దఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో భారీగా అవినీతి : డీఆర్పీ మల్లేశ్

పెనగలూరు, ఆగస్టు 30 : మండలంలోని ఈటమాపురం గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం గ్రామసర్పంచ్ మందపల్లి లక్ష్మీ అధ్యక్షతన ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై అధికారులు, పంచాయతీ ప్రజలు, కూలీల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం డీఆర్పీ మల్లేశ్ మాట్లాడుతూ ఇప్పటివరకు గుర్తించిన 30 రకాల పనుల వివరాలను తెలియజేశారు. వలంటీర్లు 3 రోజులు సచివాలయంలో విధులు నిర్వహించి మిగిలిన మూడు రోజులు వ్యక్తిగత పనులకు వెళ్లాల్సి ఉండగా 6 రోజులు ఉపాధిహామీ పనులకు వెళ్లినట్లు మస్టర్‌లు వేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్క రేషన్‌కార్డుపై 3 జాబ్‌కార్డులు ఇచ్చారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కొక్కరికి 100 రోజులు జాబ్‌కార్డులో మస్టర్ వేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు గుర్తించా మని తెలిపారు. కొంతమంది ప్రైవేటు ఉద్యోగులు, వంద రోజులు ఉపాధిహామీ పనులకు వచ్చినట్లు గుర్తించా మన్నారు. సచివాలయ భవనంలో పనులు చేయకుండా 2.10 లక్షల రూపాయలు డ్రా చేసినట్లు ఈ సందర్భంగా గుర్తించామన్నారు. బతుకుదెరువు కోసం (గల్ఫ్) వెళ్లిన వ్యక్తుల పేర్లపైన కూడా మస్టర్ వేసినట్లు గుర్తించామ న్నారు. వివాహం చేసుకుని ఇతర గ్రామాలకు వెళ్లిపోయినవారి పేర్లపై కూడా మస్టర్‌లు వేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 80 పనుల్లో ఈనెల 26 నుంచి తనిఖీ ప్రారంభించి 3 రోజులుగా 30 పనులను గుర్తించారు. అయితే పంచాయతీ పరిధిలో భారీగా అవినీతి జరిగిందని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో గ్రామసభ ఏర్పాటు చేసి పనుల వివరాలను ప్రజల ముందు ఉంచారు. కొన్ని పనులు చేయకుండానే మస్టర్‌లు వేసినట్లు గుర్తించామని డీఆర్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వరప్రసాద్, ఏపీవో మురళి, ఈసీ సుబ్బరాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గంగాదేవి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిపనుల్లో అవినీతిపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

జాబ్ మేళా క్యాలెండర్ విడుదల

రాయచోటి, కలెక్టరేట్, ఆగస్టు 30: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీ మంగళవారం ఉదయం 9:00 గంటలకు రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్, మదనపల్లి పాలిటెక్నిక్ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అప్లికేషన్‌తో పాటు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్:7799587687, 8897776368లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

- 5 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం

సిద్దవటం, ఆగస్టు 30: మండలంలోని పెద్దపల్లి పంచాయతీ రామస్వామి పంట పొలాల్లో కోడి పందేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. వారి నుంచి 5 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లను, రూ.24,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఉద్యాన సాగు వివరాలను విద్యార్థులు తెలుసుకోవాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 30: సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యాన సాగు వివ రాలను విద్యార్థులు తెలుసుకోవాలని అధ్యాపకులు జ్యోతిర్మయి, మాధవి, డాక్టర్ హెచ్.అరుణకుమారి, డాక్టర్ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం నుంచి రైల్వేకోడూరు మండలం ఉద్యాన కళాశాలలో ప్రధాన యూనివర్సిటీ వెంకటరామన్నగూడెం నుంచి నాలుగు రోజుల పాటు వర్చువల్‌గా నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మొక్కలకు వైరస్‌లు, నేల, నీటి సంబంధాలు, ఉద్యాన పంటల అభివృద్ధికి బయో టెక్నాలజీ విధానాలు అవసరమని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అన్సుభరద్వాజ్, డాక్టర్ సుదీప్. ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కే. గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యాన సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అనంతరాజుపేట కళాశాల ఇన్‌ఛార్జ్ డీన్ డాక్టర్ కే.ఎం యువరాజ్, డాక్టర్ రాజా నాయక్, డాక్టర్ రామయ్య, డాక్టర్ వీవీ పద్మ, డాక్టర్ అరుణోదయం, డాక్టర్ ఎన్. వినోద్ కుమార్, డాక్టర్ హర్షిత, డాక్టర్ జి. సిద్దేశ్వరి, డాక్టర్ కే. దినేష్, అనంతరాజుపే ఆచార్యులు సీహెచ్ రూత్ బెనర్జీ, శాస్త్రవేత్త సదరున్నీసా, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఒంటిమిట్ట, ఆగస్టు 30 : విద్యుత్ ఉద్యోగిపై వైసీపీ నేత ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ నేత కొమరా వెంకటనరసయ్య అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులపై దాడి చేయడం అలవాటు చేసుకున్న నాయకులు ఇంకా ఆ సంప్రదాయం కొనసాగించడం దుర్మార్గమన్నారు. రౌడీయిజం, గూండాయిజానికి టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సురేష్‌పై దాడికి పాల్పడడం దారుణమన్నారు. వెంటనే ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, అతని అనుచరులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోదుగుల నరసింహులు, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యనిర్వాహక సభ్యులు అడ్వకేట్ రాందాస్, మామిళ్ల ఈశ్వరయ్య, రఘునాథ్ రెడ్డి, రేవిళ్ల బాలమునెయ్య పాల్గొన్నారు.

రాజీ పడదగిన కేసులు పరిష్కరించాలి

నందలూరు, ఆగస్టు 30 : రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి సూచించారు. జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలో పోలీసు అధికారులతో గురువారం ఆమె క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబరు నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. జాతీయ లోక్‌అదాలత్ సంబంధించి ప్రతిరోజు ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఈబీ సీఐ పవన్‌కుమార్, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట ఎస్ఐలు వెంకటేశ్వర్లు, పి.రవిప్రకాష్‌రెడ్డి, మోహన్‌కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జిలతో ఆర్టీసీ కార్మికుల నిరసన


డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

రాజంపేట టౌన్, ఆగస్టు 30 : ట్రెజరీ అధికారులు నైట్ అవుట్ అలవెన్సులను ఆపి ఇబ్బందులకు గు రి చేస్తున్నారని ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్ర వారం పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు వద్ద నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయినప్పటి నుండి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇతర ప్రభు త్వ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలన్నీ తమకు వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరి రమణ, గ్యారేజ్ సెక్రటరీ దేవరాజు, డిపో అధ్యక్షుడు శివయ్య, గ్యారేజ్ అధ్యక్షుడు గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

పేదల మనిషి పరిటాల రవీంద్ర


పరిటాల రవీంద్రకు నివాళులర్పిస్తున్న నాయకులు

సుండుపల్లి, ఆగస్టు 30: పేదల మనిషి పరిటాల రవీంద్ర అని తెలుగు యువత అధ్యక్షుడు మాలేపాటి సురేష్ నాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. టీడీపీ కోసం, రాయలసీమ ప్రజల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి జయంతిని నిర్వహించుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు రెడ్డి రాణి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీష్, టీడీపీ నాయకులు శివరాం నాయుడు, జనార్దన్, చంద్రమౌళి, మేకల మహబూబ్ బాషా, ఎల్వీ రమణా, ఎంపీటీసీ మాజీ సభ్యులు బెలాల్ల రమణ, బాబు మోహన్ నాయుడు, గ్రామ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమవుతుందని, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ సభ్యత్వ కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. సభ్యత్వం పొందాలని కోరుకునేవారు తమ మొబైల్ ఫోన్ నుంచి 8800002024 అనే నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే దానికి ఒక లింక్ వస్తుందని, ఆ లింకు ద్వారా మన పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ప్రపంచ స్థాయిలో అతిపెద్ద పార్టీగా బీజేపీ సభ్యత్వం నమోదు చేసి రికార్డు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆదినారాయణ, వీవీ రమణ, నాగరాజు, సూర్యచంద్ర, తోట నగేష్, పుల్లయ్య, సి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

‘చలో తిరుపతి’ విజయవంతం చేయండి

రాజంపేట టౌన్, ఆగస్టు 30 : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ చలో తిరుపతి ఎస్పీడీసీఎల్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సబ్‌స్టేషన్ కార్యాలయ ప్రాంగణంలో చలో ఎస్పీడీసీఎల్ తిరుపతి ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 5న ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు ఎన్నో ఏళ్లుగా ఉన్నప్పటికి ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూఈఈయూ జిల్లా కార్యదర్శి ఇ.శ్రీహరి, యూఈఈసీడబ్ల్యూయూ డివిజన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు డి.సుధాకర్, కె.సుబ్రమణ్యం, శివ, లక్ష్మీరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్.రాచపల్లెలో వైద్యశిబిరం

పుల్లంపేట, ఆగస్టు 30 : మండల పరిధిలోని రంగంపల్లె పంచాయతీలో శుక్రవారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. చికెన్‌గన్యా, డెంగ్యూ, మలేరియా జ్వరాలపై ప్రజలకు డాక్టర్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. వైద్యశిబిరంలో జ్వరపీడితులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగజ్యోతి, ఏఎన్ఎం శివరాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన

రాజంపేట, ఆగస్టు 30: నేత్రదానంపై రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సిబ్బందికి పీఎంయూవో వి.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. కొందరు సిబ్బంది నేత్రదానం చేయడానికి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు, రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, హెచ్.చెర్లోపల్లె పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.శరత్‌కుమార్‌రెడ్డి, ఎం.వరదయ్య, జేవీడీ పి.బసవరాజు, ఎల్‌హెచ్‌ఏ గురురాజారావు, ఎస్ఏఎస్ఎస్‌టీ, హరిబాబు, వాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల నిలుపుదల పట్ల హర్షం

నందలూరు, ఆగస్టు 30 : నందలూరు రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్లను సత్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్ సారథ్యంలో రైళ్ల నిలుపుదలకు అనుమతులు తీసుకురావడం ఈ ప్రాంత వాసులకు చాలా ఉపయోగకరమన్నారు. ఎన్డీయే నాయకులు షబ్బీర్‌అహ్మద్, , పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్‌యాదవ్, తాటి సుబ్బరాయుడు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, షమివుల్లాఖాన్, ఉప్పుశెట్టి సుధీర్, ఆకుల చలపతి, విఠలాచార్య, ఆదినారాయణ, మౌలా, మురళి, జయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన


ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు, ఆగస్టు 30: క్షేత్రస్థాయిలో ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తునట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. శుక్రవారం మండలంలోని అరవీడు పంచాయితీలో తనిఖీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలోని ఫ్రీహోల్డ్ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు మండలంలోని 17 పంచాయతీల్లో పర్యటించి భూముల వివరాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు

‘గుడ్లవల్లేరు’ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయచోటి టౌన్, ఆగస్టు 30: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, జిల్లా కమిటీ సభ్యులు జశ్వంత్, నరేశ్, చెంగయ్య, గురునాథ్, జూనియర్ కళాశాల బాలికలు పాల్గొన్నారు.

గాలేరు-నగరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 1వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఇదివరకూ ఓ రిట్ పిటిషన్‌కు సంబంధించి ఈయన హైకోర్టుకు కౌంటర్ అఫిడవిట్ సక్రమంగా దాఖలు చేయలేదని, దాంతో కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ నివేదించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కోదండరామిరెడ్డి గతంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అక్కడి గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. అప్పట్లో భూసేకరణ వివాదానికి సంబంధించి కె.నాగిరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 119-2022) దాఖలు చేశారు. ఈ కేసులో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయకపోవడంతో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్ అండ్ ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీ ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ యాక్ట్ -2013 చట్టాల్లోని అంశాలను విస్మరించారని, హైకోర్టుకు వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. ఈ కారణంగానే హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గాలేరు-నగరి ప్రాజెక్టు 1వ యూనిట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ధ్వంసమైన ఏటీఎం



ఎస్బీఐ ఏటీఎంలో రూ.39 లక్షల చోరీ

చంద్రగిరి, ఆగస్టు 30: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం స్థానికులు ఏటీఎంలో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రామయ్య, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఏటీఎంను పరిశీలించి, వేలిముద్రల నిపుణులను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలి ముద్రలు సేకరించిన అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా గురువారం రాత్రి 1.30 నుంచి 2.30 గంటల మధ్యలో ఓ దుండగుడు సెక్యూరిటీ గార్డు ముసుగులో ఏటీఎం రూములో చొరబడ్డాడు. ఏటీఎం డిజిటల్ పాస్‌వర్డ్‌ను కీ ప్యాడ్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.39 లక్షల నగదును ఎత్తుకెళ్లాడు. ఏఎస్పీ నాగభూషణం, క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ కూడా ఏటీఎంను పరిశీలించారు.బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇప్పటివరకూ ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి నగదును చోరీ చేసేవారు.ఈసారి డిజిటల్ లాక్ కీ ప్యాడ్‌ను పగలగొట్టి చోరీ చేయడం చూస్తుంటే ఇది ఏటీఎం టెక్నీషియన్ పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.



సీసీ ఫుటేజీలో బయటపడ్డ చోరుడు



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

చోరీ చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు చంద్రగిరి పోలీసులతో ఒక బృందాన్ని, తిరుపతి క్రైమ్ పోలీసులతో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ నాగభూషణం తెలిపారు. చోరీ జరిగిన ఎస్బీఐ ఏటీఎంను ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి పరిశీలించారు.భద్రతా ఏర్పాట్లపై బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలనే చోరీ జరిగిందంటూ అసహనం వ్యక్తం చేశారు.ఇకపై ఏటీఎంల వద్ద ఖచ్చితంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రమణకుమార్, సీఐ రామయ్య ఉన్నారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను ప్రత్యేక అధికారిగా నియమించింది.జిల్లాలో మొత్తం కార్యక్రమాలను ఆయన తరచూ పర్యవేక్షిస్తూ సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యేలా కృషి చేయనున్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రోత్సాహకం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 30: జిల్లాలోని రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకం ఇస్తోందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మ్యాంగో భవన్‌లో ఉద్యాన, వ్యవసాయ, నాబార్డు సంయుక్తంగా రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల దుకాణం ఏర్పాటుకు, రైతులు పండించే కూరగాయలు, పండ్ల సేకరణ కేంద్రాలకు 75శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోందన్నారు.నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లను సైతంఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. కూరగాయల సేకరణకు వాహనాలను సైతం సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో డీడీఏలు, ఏడీఏలు, ఏవోలతో ప్రకృతి వ్యవసాయంపై ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు నిర్వహించిన వికసిత్ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏటా 15 శాతం వ్యవసాయం అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని, అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు రండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30: కాణిపాక బ్రహ్మోత్సవాలకు రావాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఇన్‌చార్జి ఈవో వాణి కోరారు. ఈ మేరకు అమరావతిలో కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపుహరిబాబునాయుడు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ పాల్గొన్నారు.

సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా తిరుమలలో మొక్కల పెంపకం : ఈవో

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సీడ్ బౌల్ కాన్సెప్ట్ ద్వారా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వనమహోత్సవంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి పాల్గొన్న ఈవో తిరుమలలోని పద్మావతి విశ్రాంతి భవన ప్రాంగణంలో మాను సంపంగి 'స్థలవృక్షం' నాటారు. ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు మరింత ఆహ్లాదకర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని వివిధ ప్రదేశాల్లో వందలాది మాను సంపంగి (మాగ్నోలియా చంపాకా), చందనం (సంతాలమ్ ఆల్బమ్), సీతా అశోక (సరకా అసోకా) మొక్కలను నాటారు. టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవోలు భాస్కర్, ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఈవో

తిరుపతిలో ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

తంబళ్లపల్లెవాసికి తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: తిరుపతి శ్రీనివాస సేతు (ఫ్లై ఓవర్)పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకి చెందిన మణికంఠ నాయక్ స్థానిక అలిపిరి శ్రీవారి సన్నిధి వద్ద ఉన్న పెట్రోలు బంకులో ఆరేళ్లుగా పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎస్వీ నగర్‌లో కాపురమున్న తన సోదరి ఇంటికెళ్లి తిరిగి తిరుచానూరు నుంచి అలిపిరికి ఫ్లైఓవర్‌పై ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. పీఎస్4 హోటల్ సమీపంలో ఫ్లైఓవర్‌పై నిబంధనలకు విరుద్ధంగా ఎదురుగా వస్తున్న ఏపీ03 టీఎల్ 4187 నెంబరు గల లగేజీ ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జవగా, మణికంఠ నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బాధితుడి తండ్రి గోపాల్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ తరుణ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.



తీవ్రంగా గాయపడ్డ మణికంఠ నాయక్

హత్య కేసులో నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్ - నిందితులు

చిత్తూరు, ఆగస్టు 30: తాగిన మైకంలో యువకుడిని బండరాయితో కొట్టి చంపిన కేసులో ముగ్గురు నిందితులను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సాయినాథ్ ఆ వివరాలను మీడియాకు వివరించారు. బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన షేక్‌దావూద్‌బాషా(25) రెండు రోజుల క్రితం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న బార్‌లో మద్యం తాగి అక్కడే పడుకున్నాడు. తోటపాళ్యంకు చెందిన మణికంఠన్, అతని స్నేహితులు కార్తీక్, వేములరాజులు అతన్ని లేపి మద్యానికి డబ్బు ఇవ్వాలని బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.200 లాక్కుని మద్యం తాగారు. ఇంకా డబ్బులు కావాలని కొట్టుకుంటూ వీరభద్రకాలనీ శ్మశానం వద్దకు తీసుకెళ్లారు. రూ.20వేలు తీసుకురమ్మని బెదిరించారు. డబ్బు లేదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన మణికంఠన్ పక్కనే ఉన్న రాయితో దావూద్‌బాషా తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. రామకుప్పంలో 10.8, శ్రీరంగరాజపురం 3.4, శాంతిపురం 3.2, బైరెడ్డిపల్లి 1.4, వి.కోటలో 1.0 మి.మీ వర్షం కురిసింది.

శ్రీవారికి 16 ద్విచక్ర వాహనాల విరాళం



ఈవో, అదనపు ఈవోకు వాహనాల తాళాలను అందజేస్తున్న వేణుసుదర్శన్

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 16 ద్విచక్ర వాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్స్ ఎండీ వేణుసుదర్శన్ ఈ వాహనాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. 16 ద్విచక్ర వాహనాల్లో 15 ఎలక్ట్రికల్ వాహనాలు ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ.22 లక్షలు అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రోగి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

● స్విమ్స్‌లో బాధితులతో కలిసి ఎమ్మార్పీఎస్ నేతల నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 30: స్విమ్స్‌లో మూడ్రోజుల కిందట కనిపించకుండా పోయిన రోగి ఆచూకీ కోసం స్విమ్స్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అయినా ఆచూకీ తెలియక పోవడంపై బాధితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ ఈనెల 27వ తేదీన వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకొచ్చారు. అదే రోజున సీతారామప్పను ఎంఐసీయూ వార్డులో అడ్మిషన్ చేసుకోగా, అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయంపై బాధితులు స్విమ్స్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా జాడ తెలియలేదు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు బాధితులకు మద్దతుగా నిలిచి శుక్రవారం స్విమ్స్‌లో నిరసన తెలిపారు. నడిచే స్థితిలో కూడా లేని వ్యక్తి అర్ధరాత్రి నాలుగు అంతస్తుల పైనుంచి ఎలా కిందకు వచ్చి, బయటకు వెళ్లాడో అధికారులే చెప్పాలని నాయకులు ప్రశ్నించారు. ఏదేమైనా తన తండ్రిని తమకు అప్పగించే బాధ్యత స్విమ్స్ యాజమాన్యాదేనని కుమారుడు విశ్వనాథ్ అన్నారు.



స్విమ్స్‌లో బాధితులకు మద్దతుగా నిలిచిన ఎమ్మార్పీఎస్ నేతలు

పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి మెమోలు! : స్విమ్స్‌లో రోగి కనిపించకుండా పోయిన విషయంపై పలువురు వైద్యాధికారులకు, సిబ్బందికి శుక్రవారం డైరెక్టర్ ఆర్వీకుమార్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులైన వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని స్విమ్స్ అధికారులు పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.51 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 62,529 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 29,730 మంది తలనీలాలు సమర్పించారు.

పిల్లలూ.. వెల్‌డన్

● జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను అభినందించిన కలెక్టర్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 30: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్ఞాపికలు అందజేశారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల్లో రాణించిన ఐదుగురు క్రీడాకారులను అభినందించారు. ఇందులో బాస్కెట్‌బాల్ విభాగంలో రజత పతకం పొందిన ఎం.గురుచరణ్, ఖోఖో విభాగంలో కాంస్య పతకం పొందిన ఎ.రాజ్‌కుమార్, దక్షిణ భారత స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఇ.బద్రీనాథ్, ఫెన్సింగ్ విభాగంలో చిన్నారులు అర్చునిషా, ఐ.తులసీరామ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఎస్డీవో బాలాజీ, రెజ్లింగ్ కోచ్ ఎస్.రఫీ అహ్మద్, ఫెన్సింగ్ కోచ్ ఎం.రాఘవ కార్తీక్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : డీఆర్ఎం

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 30: తిరుపతి, తిరుచానూరు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తిరుపతిలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ నిర్వాహణ, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారాల పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. కోచ్ మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. అంతకుముందు తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియర్‌స్కేల్ అధికారులు శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, మణికంఠ, ఉపేంద్ర కుమార్, ప్రభాకర్, సురేష్ బాబు, మాధవరావు,ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజయ్ కుమార్

శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తనిఖీలు

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో జరుగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం సాయంత్రం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. వాహన మండపం నుంచి తనిఖీలు ప్రారంభించిన అధికారులు మాడవీధుల్లోని గ్యాలరీల్లోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, గరుడసేవలో గ్యాలరీలను రెండవసారి నింపడం, తదితర భద్రత అంశాలను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున చక్రస్నానం, ఇతర సంబంధిత అంశాలపై చర్చించారు. పుష్కరిణి లోపలికి వెళ్లే, బయటకు వచ్చే మార్గాలను కూడా పరిశీలించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.



పరకామణిలోనూ..

అంతకుముందు శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలోనూ ఈవో, అదనపు ఈవో, సీవీఎస్వో తనిఖీలు నిర్వహించారు. హుండీల తరలింపు, నాణేలు, కరెన్సీల విభజన ప్రక్రియ, పరకామణి లెక్కింపులు, డ్రెస్‌కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత సీసీటీవీ గదిని కూడా చూశారు. ఈ కార్యక్రమాల్లో సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 సత్యనారాయణ, పరకామణి ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, హెల్త్ డిప్యూటీఈవో ఆశాజ్యోతి, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవా సదన్‌లో..

తిరుమలలోని శ్రీవారిసేవాసదన్ 1, 2 భవనాలను కూడా పరిశీలించారు.తిరుమలలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల నమోదు, లాకర్లు, స్కార్ఫ్‌లు, బెడ్‌లు, డ్యూటీల కేటాయింపు, ఆలయ విధులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్, సత్సంగం, ధ్యానం, భజన కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సేవాసదన్ 2లోని జీడిపప్పు వలిచే హాల్‌ను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత సేవాసదన్‌లలో పరిశుభ్రత, శ్రీవారిసేవకుల వసతి, అన్నప్రసాదం, దర్శనం తదితర సౌకర్యాలను ఈవో, అదనపు ఈవో పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పీఆర్వో నీలిమ, ఏవీఎస్వో సాయిగిరిధర్, శ్రీవారిసేవ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రద్దీలో అత్యవసర వాహనాల రాకపోకలకు అనువుగా ఏర్పాట్లు చేయాలి : ఎస్పీ సుబ్బరాయుడు

బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ అత్యవసర వాహనాలైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు సులువుగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి మాడ వీధులతో పాటు తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన ఎస్పీ పోలీసు, విజిలెన్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల మధ్య ఎలాంటి తోపులాటలు లేకుండా పటిష్ఠమైన బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి గ్యాలరీలను అనుసంధానం చేస్తూ క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఈ సమాచారాన్ని భక్తులకు తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే తిరుమలకు అనుమతించాలన్నారు. ఈకార్యక్రమంలో తిరుమల ఇన్‌చార్జ్ అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు, ఎస్ఐలు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం.. పర్యావరణానికి వరం


మదనపల్లె నగరవనంలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు


పీలేరు గురుకులంలో మొక్కలు నాటుతున్న అధికారులు, టీడీపీ నాయకులు


పెద్దమండ్యం కలిచెర్ల హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శ్రీధర్‌రావు తదితరులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 30: సమాజంలో పచ్చదనం పర్యావరణానికి వరంలాంటిదనం వక్తలు పేర్కొన్నారు. మానవులు పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలని ఫారెస్ట్ రేంజి అధికారి మదనమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా స్థానిక పుంగనూరు రోడ్డులోని నగరవనంలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ అడవులు, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అంతే కాకుండా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పట్టణంలో మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టారన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో భానుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలు రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఆర్‌వో మదనమోహన్, సెక్షన్ ఆఫీసర్లు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

పీలేరులో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం పీలేరు మండలంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం, ఫారెస్టు శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అటవీ శాఖ పీలేరు ఫారెస్టు అధికారి రామ్లా నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటడంతోనే సరిపెట్టకుండా వాటిని సంరక్షించాలన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, పద్మావతి, ఎఫ్ఎస్‌వో సబిహా సుల్తానా, ఏపీవో మహేశ్వర, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షామియాన షఫీ, టీడీపీ నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, గుర్రం నరేశ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఫారెస్టు సిబ్బంది రెడ్డి ఆశాబీ, జగదీశ్, చంద్రకళ, ఉపాధి సిబ్బంది ప్రసాద్ బాబు, రియాజ్, శ్రీరాములు, గోపీ పాల్గొన్నారు.

ములకలచెరువులో: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో పోలప్ప సూచించారు. మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని టి.సదుం పంచాయతీ రేకలగుంటి వద్ద రోడ్డుకు ఇరు వైపులా మొక్కల నాటే కార్యక్రమాన్ని ఉపాధిహామీ ఏపీవో తిరుపాల్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాపురం వెంకటరెడ్డి, టి.సదుం వెంకటప్ప, చింతమాను సుబ్బరాయప్ప, రేకల గుంటిపల్లె రాజారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్, యహోనా, శీన, బాబు, రవి, ఈరప్ప పాల్గొన్నారు.

కురబలకోటలో: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఏపీవో వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తెట్టు పంచాయతీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీఏ పుష్ప, ఎఫ్ఏ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గట్టు జడ్పీహైస్కూల్ ఆవరణలో ఎంపీడీవో శంకరయ్య, ఎంఈవో రెడ్డిశేఖర్, ఏపీవో మంజుల మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్ర మంలో హెచ్‌యం లలితకుమారి, పాఠశాలకమిటీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సులోచన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: మండలంలోని కలిచెర్ల హైస్కూల్‌లో శుక్రవారం ఎఫ్ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో వనమహోత్సవం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో 10 మొక్కలను తెచ్చి నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. దశల వారిగా అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం రామచంద్ర ఎఫ్ఈఎస్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకు ఆర్టీసీ డిపోను కేటాయించండి

● రవాణాశాఖ మంత్రిని కోరిన టీడీపీ నేత జయచంద్రారెడ్డి


రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్‌డ్డితో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 30: తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఆర్టీసీ డిపోను కేటాయించాలని రాష్ట్ర రవానా, యువజన, క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. విజయవాడలోని సచివాలయంలో శుక్రవారం మంత్రిని టీడీపీ నేత జయచంద్రారెడ్డి కలిసి ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఆర్టీసీ డిపో మంజూరు చేయాలని, అలాగే ఇసుక కొరతతో గృహ నిర్మాణదారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారనా, త్వరగా ఇసుక రీచ్‌ను కేటాయించాలని కోరారు. అలాగే గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు చిటికె శివారెడ్డి, కొండ్రెడ్డి అశోక్, మూగా రవిచంద్ర తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమించి లేఅవుట్‌లు వేస్తే చర్యలు

● జలవనరులను పూడ్చివేస్తున్న వారిని హెచ్చరించిన అధికారులు


అనుమతి లేనిలేఅవుట్‌ను పరిశీలిస్తున్న పీకేఎం ఉడా వైస్‌ఛైర్మన్, డీఎల్పీవో

మదనపల్లె టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి లే అవుట్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని పీకేఎం-ఉడా వైస్ ఛైర్మన్ బాబర్, డీఎల్పీవో నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వలసపల్లె పంచాయతీ పుంగనూరు మార్గంలో జాతీయ రహదారి పక్కన లేఅవుట్ వేస్తుండగా అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పీకేఎం-ఉడా వైస్‌ఛైర్మన్ బాబర్ మాట్లాడుతూ లేఅవుట్‌లు వేసే వాళ్లు తప్పనిసరిగా రెవెన్యూ కన్వర్షన్ చార్జీలతో పాటు పంచాయతీకి బెటర్‌మెంట్ చార్జీలు, 10శాతం కమ్యునిటీ అవసరాలకు స్థలం వదలాల్సి ఉందన్నారు. అంతే కాకుండా కొందరు వ్యవసాయ భూముల్లో వెళుతున్న వాగులు, వంకలను(జలవనరు లను) పూడ్చి వేసి చదును చేసి ప్లాట్లు వేస్తున్నారని దీనిపై మద నపల్లె తహసీల్దార్ ఖాజాబీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పీకేఎం ఉడా అధికారులు కుముదిని, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న ఎంపీడీవో బాలాజీకి ఘన సన్మానం


ఎంపీడీవో బాలాజీని ఘనంగా సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 30 : విజయవాడలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ప్రతిభా పురస్కారం అందుకున్న పెద్దతిప్ప సముద్రం ఎంపీడీవో కేఎన్ బాలాజీని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్తగా తెలుగుభాషా కవిత్వం, కథ విమర్శ రంగాల్లో విశేష కృషి చేసినందుకు ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిభా పురస్కారం ఇవ్వడం చాలా గర్వించదగ్గ విషయమని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. అనంతరం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీని కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మదనపల్లె అర్బన్ ఆగస్టు30: మదనపల్లె డివిజన్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల్లో, వీధుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు సూచించారు. శుక్రవారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయ చవితి పండుగను పురస్కరించుకుని బలవంతపు చందాలు వసూలు చేయడం నిషేధమని అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమతిలేని మండపాలను తొలగిస్తామని చెప్పారు. విగ్రహాల ఏర్పాటులో ఎలాంటి అవాంఛనీయమైన సంఘనలకు తావు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి


కలకడ, ఆగస్టు 30:వినాయక చవితి పండుగను పురష్కరించుకొని గ్రామస్థులు పురవీధుల్లో మట్టితో తయారీ చేసిన గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కలకడ పంచాయతీ కార్యదర్శి జయేంద్ర తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్ సూచనలు మేరకు బస్టాండు కూడలి వద్ద నిబంధనలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్లాస్టరాప్ పారీస్, పెయింట్‌తో తయారైన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఉన్నందున ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాక్సీల అద్దె బకాయిలు వెంటనే చెల్లించండి


ఎంవీఐ దినేష్‌చంద్రకు వినతి పత్రం ఇస్తున్న ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లు

మదనపల్లె టౌన్, ఆగస్టు 30: ఎన్నికల విధులకు వినియోగించిన ట్యాక్సీల అద్దెలు వెంటనే చెల్లించాలని ట్యాక్సీ యజమానులు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక ఆర్టీవో కార్యాలయం ఎదుట ట్యాక్సీ యజమానులు నవ యువ కారు డ్రైవర్స్, యజమానుల అసోసియేషన్ సభ్యులు ధర్నా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల సమయంలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల ఎన్నికల విధులకు తమ కార్లను అద్దెకు ఇచ్చామని తంబళ్లపల్లెలో రూ.15లక్షలు, మదనపల్లెలో రూ.14 లక్షలతో పాటు, కాన్వాయ్ వాహనాలకు రూ.7లక్షలు అద్దె బకాయిలు చెల్లించాల్సి వుందన్నారు. ఈ విషయమైన పలు మార్లు రెండు నియోజకవర్గాల తహసీల్దార్లకు విన్నవించినా, తమకు బకాయిలు రాలేదన్నారు. ఇంతలో తహసీల్దార్లు బదిలీపై వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక తాము ఆర్టీవో కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. తమను ప్రభుత్వం ఆదుకుని బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంవీఐ దినేష్‌చంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సయ్యద్‌సాహెబ్ వలి, ఎం.వెంకటరమణ, ప్రభాకర్‌రెడ్డి, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా


డీవైఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి తమకు బదులుగా ప్రైవేటు వ్యక్తిని పెట్టి పాఠాలు చెప్పిస్తున్న ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ధర్నా చేశారు. శుక్రవారం మదనపల్లె డీవైఈవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రామసముద్రం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు విధులకు హాజరైనా విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా ప్రైవేటు వ్యక్తిని నియమించుకుని ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎంఈవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఉత్తన్న, గంగరాజు, రాజేష్‌నాయక్, హరి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యపన్నులశాఖలో రీజనల్ ఆఫీసు విధానం వద్దు

మదనపల్లె టౌన్, ఆగస్టు 30: రాష్ట్రంలో వాణిజ్యశాఖలో గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన రీజనల్ ఆఫీసు వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ సీటీ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.హర్షం, కేఆర్ గిరిధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం వద్ద ఆ శాఖ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన బదిలీలపై తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాణిజ్యశాఖలో బదిలీల గడువును 15 రోజులకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

తంబళ్లపల్లె, ఆగస్టు 30: ప్రతిఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీటీ ఇషాక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచాలమర్రి దళితవాడలో సివిల్‌రైట్స్‌డేలో భాగంగా గ్రామస్థులకు హక్కులు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆరాతీశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎరుకుల హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు రఘుపతి, అఖిల భారత బంజారా సేవా సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల వేదికగా పవన్ జన్మదిన వేడుకలు

పీలేరు, ఆగస్టు 30: ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని సామాజిక సేవా కార్యక్రమాల వేదికగా నిర్వహించనున్నట్లు పార్టీ పీలేరు ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్ తెలిపారు. వచ్చే నెల 2వ తేదీన రానున్న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన సేవా కార్యక్రమాల సన్నాహాలపై శుక్రవారం ఆయన స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జనసైనికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జనసైనికులు కలప రవి, వల్లెపు మోహనకృష్ణ, గురుమోహన్, ప్రభాకర్, గాయత్రి, డా.మురళీ, జబీర్, మున్నా, రెడ్డప్ప, మహేశ్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు

నిమ్మనపల్లి, ఆగస్టు 30: మండలంలోని పింఛన్ లబ్ధిధారులకు ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేయాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 5110 ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు ఉండగా రూ.2కోట్ల 26లక్షల 56వేలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. 1వతేదీన ఆదివారం రావడంతో ఈ నెల 31న శనివారం రోజున సచివాలయ సిబ్బంది, కార్యదర్శులచే పంపిణీ చేసేవిధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు.

నూతన అధికారులకు సన్మానం

బి.కొత్తకోట, ఆగస్టు30: బి.కొత్తకోట మండలానికి బదిలీ అయి బాధ్యతలు చేపట్టిన సీఐ రాజారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌రావులను పట్టణానికి చెందిన భారతీయ అంబేడ్కర్‌సేన(బాస్)నాయకులు శుక్రవారం దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కేవి.రమణ, సింగన్న, సచిన్, రామచంద్ర, పలకవెంకటేష్, వెంకట్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు .. సారా స్వాధీనం

మదనపల్లె అర్బన్, ఆగస్టు30: మండలంలోని కోటావారిపల్లె గ్రామం, నారమాకులతాండా గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న బుక్కే రవినాయక్‌ను అరెస్టు చేసి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. శుక్రవారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ హరిహర ప్రసాద్ నారమాకుల తాండాకు వెళ్లి సారా బట్టీలను ధ్వంసం చేశామన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

ములకలచెరువు, ఆగస్టు 30: ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ములకలచెరువు సీఐ రాజరమేష్ హెచ్చరించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో శుక్రవారం దుకాణదారులు, ద్విచక్రవాహనదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నందున ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల పూజ


అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గుర్రంకొండ, ఆగస్టు 30:అక్కదేవతల పెద్ద పూజ కార్యక్రమాన్ని శుక్రవారం అమిలేపల్లె క్రాస్ వద్ద వైభవంగా నిర్వహించారు. మండలంలోని మర్రిమాకులపల్లె బస్టాప్ వద్ద అక్కదేవతల గుడిలో ఉదయాన్నే ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం భక్తులు అక్కదేవతలకు మొక్కగా తెచ్చిన మట్టి గుర్రాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలను చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జీవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన విద్యనందించాలి


హైస్కూల్‌లో పాఠ్యపుస్తకాలను తనిఖీ చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

గుర్రంకొండ, ఆగస్టు 30:ప్ర భుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్యను అందిం చాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన గుర్రంకొండ తెలుగు హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను ప్రణాళిక ప్రకారం బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే బాలికల గురుకుల పాఠశాల్లో విద్యార్థినుల సౌకర్యాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈవో సురేంద్రబాబు, సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ సాయిశిరీషా తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటును పునఃసమీక్షించండి

పీలేరు, ఆగస్టు 30: డివిజన్ స్థాయిలో జరుగుతున్న అసంబద్ధ ఉపాధ్యాయుల సర్దుబాటును పునఃసమీక్షించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. అలాగే రాష్ట్ర నాయకుడు పోతంశెట్టి రమేశ్, ఎస్టీయూ పీలేరు మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరెడ్డి, వెంకటరమణలు వేర్వేరుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతి డివిజన్‌లో ఉన్న పీలేరు మండలాన్ని రాయచోటి డివిజన్‌లో కలిపి ఉపాధ్యాయులు సర్దుబాటు చేయడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న చోట్ల విద్యావలంటీర్లను నియమించకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం బాధాకరమన్నారు.

హైర్ బస్సులను సకాలంలో నడపాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 30: హైర్ బస్సులు సమయ పాలనతో నడపాలని శుక్రవారం వన్ డిపో కార్యాలయంలో హైర్ బస్సు యాజమానుల సమావేశంలో ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ బస్సులను శుభ్రంగా ఉంచాలని, డ్రైవర్లు ప్రతి స్టేజ్‌లో ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని తెలిపారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని కోరారు. యాజమానుల నుంచి కూడా సూచనలు, సలహాలు తీసుకున్నట్లు తెలిపారు.

రక్తదానంతో ప్రాణరక్షణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 30:రక్తదానంతో ప్రాణరక్షణ కల్పించవచ్చని వక్తలు పేర్కొన్నారు. హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో మదనపల్లె జర్మజన భోధనాపత్రి రక్త నిధి కేంద్రం వారు స్థానిక జోస్ అలుక్కాస్ 60వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేషస్పందన వచ్చినట్లుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అబూబక్కర్ సిద్ధిక్ తెలిపారు. ఇందులో 32 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్తనిధి మెడికల్ ఆఫీసర్ భార్గవ్, జోస్ అలుక్కాస్ మేనేజర్ అలెక్స్, అసిస్టెంట్ మేనేజరు సంతోష్, అకౌంట్ మేనేజరు జీను, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు30: ఏకీకృత స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, అసోసియేషన్ అధ్యక్షరాలు హేమలత, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, సీనియర్ నాయకులు రవిప్రకాష్, గాలి రవీంద్ర, సుధాకర్, శ్రీనివాసులు, పయని హరికృష్ణ, శ్రీలత, నాగరత్న పాల్గొన్నారు.

పీలేరులో: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టినట్లు ఏపీసీపీఎస్ఎంఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. పీలేరులో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

'ట్రెజరీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి'

పీలేరు, ఆగస్టు 30: అలవెన్సులు, పెండింగ్ బిల్లుల చెల్లింపులో ట్రెజరీ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ట్రెజరీ అధికారుల వైఖరిని ఖండిస్తూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం పీలేరులోని ఆర్టీసీ కార్మికులు డిపో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు సీవీ రమణ మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చే జీతభత్యాలు, అరియర్స్, పెండింగ్ బిల్లులను పారదర్శకంగా చెల్లించే విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రీజనల్ కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, ఎంహెచ్ నాయుడు, వీపీ నాయుడు, బీఆర్‌బీ నాయక్, ప్రసాద్, శేఖర పాల్గొన్నారు.

నైట్ అవుట్ అలవెన్సులు పునరుద్ధరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 30: కండరెక్టర్లకు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్సులు పునరుద్ధరించాలని శుక్రవారం నల్లబాడ్జీలతో ఎన్ఎంయూ నాయకులు నిరసన చేపట్టారు. మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఆధ్వర్యంలో గ్యారేజ్ గేట్ల వద్ద ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ఎన్ఎంయూ నాయకులు నిరసన చేశారు. ఎన్ఎంయూ టూ డిపో అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి మునికృష్ణ రీజనల్ ఉపాధ్యక్షుడు ఐ.సుధాకర్, వన్ డిపో అధ్యక్షుడు అమరనాథ్, కార్యదర్శి రమణ, గ్యారేజ్ సెక్రటరీ రెడ్డిబాషా, శ్రీనివాసులు, సూరిబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఫ్రీ హోల్డ్ భూముల సర్వే

తంబళ్లపల్లె, ఆగస్టు 30: మండలంలో చేపడుతున్న ఫ్రీ హోల్డ్ భూముల సర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు హరికుమార్ సూచించారు. శుక్రవారం సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించి సర్వే చేసే విధానాన్ని వివరించారు. ఫ్రీ హోల్డ్ భూముల సర్వే ప్రక్రియను ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఇచ్చిన ప్రోఫార్మా ప్రకారం పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా ఇంటింటి ఓటరు సర్వే చేసి జాబితా పరిశీలన ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, ఆగస్టు 30: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం టీటీడీ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం సుప్రభాత సేవ మొదలకుని ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం నూతన వధూవరులైన శ్రీసీతారామలక్ష్మణులకు విశేషాలంకరణలు గావించి మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కళ్యాణమహోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజుభట్టార్, అనీల్‌కుమార్, భాషికాచార్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

● విద్యార్థుల కదలికలపై మానిటరింగ్ కమిటీ నిఘా ఉంచాలి


ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 30: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలికిరి సీఐ కె. రెడ్డిశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కళాశాలకు చెందిన ఒక విద్యార్థి గురువారం మైదుకూరులో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ర్యాగింగ్ కారణంగానే అతను బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సీఐ శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి కళాశాల ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించి విద్యార్థులపై నిఘా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ పైనా చర్యలు తీసుకోండి

కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌ల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి ప్రవీణ్‌కు న్యాయం జరగాలని స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, ప్రిన్సి పాల్ వెంకటేశ్వర రావులకు వినతి పత్రం అందజేశారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కలికిరి, ఆగస్టు 30: కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిశోర బాలకలు కలుషిత తాగు నీటి గురించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప, హెల్త్ హెడ్యుకేటర్ మహ్మద్ రఫీ, వైస్ ప్రిన్సిపాల్ గులాబ్ జాన్, ఎంఎల్‌హెచ్‌పీ ఆయేషా, ఏఎన్ఎం రమాదేవి, ఆశాలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలలోని బాలికల వసతి గృహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ ఎస్దానీ, సీహెచ్‌వో పి. భబితాలు సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. వసతిగృహంలో ఆర్వో ప్లాంట్ ద్వారా అందిస్తున్న తాగునీటి నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి పాఠశాల ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరానికి విశేష స్పందన

కురబలకోట, ఆగస్టు 30: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం మదనపల్లెకు చెందిన అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 100 మందికి చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కమాల్ బాషా, మార్కెటింగ్ మేనేజర్ ఇమ్మానుయేల్, , ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు మినీ గోకులం షెడ్లు

పెద్దమండ్యం, ఆగస్టు30: పాడిఆవు రైతులందరికి మిని గోకులం షెడ ను ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా పశు వైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో శుక్రవారం ఆయన పర్యటించి పశు వైద్యశాలను తనిఖీ చేశారు. పాడిఆవు రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం 90 శాతంతో మిని గోకులషెడ్లు మంజూరు చేసిందన్నారు. దశల వారీగా అర్హులందరికి గోకులం షెడ్లు మంజూరు చేస్తారని తెలిపారు. ముందుగా పెద్దమండ్యం పరిధిలోని రెడ్డివారిపల్లి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.